
బ్రహ్మోత్సవాలకు వేళాయే!

- 17 నుంచి ప్రారంభం కానున్న యాగంటి ఉమామహేశ్వరస్వామి ఉత్సవాలు
- 20న రథోత్సవం
- భక్తులకు వసతుల కల్పనలో నిమగ్నమైన ఆలయ అధికారులు



ఆలయంలో ఏకశిలారూపంలో కొలువైన శివపార్వతులు



యాగంటి ఆలయ ఏరియల్ వ్యూ



యాగంటిక్షేత్రంలో రోజురోజుకు పెరుగుతున్న నందీశ్వరుడు

బనగానపల్లెరూరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రసిద్ధిగాంచిన యాగంటి క్షేత్రంలో శ్రీఉమామహేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఐదురోజులపాటు అంగరంగవైభవంగా జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి శ్రీఉమామహేశ్వరులను దర్శించుకుంటారు. దీంతో భక్తులకు సకల వసతులు కల్పించే పనుల్లో ఆలయ అధికారులు నిమఘ్నమయ్యారు. 17వ తేదీన ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్రనామావళి, ధ్వజారోహణంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 18న ఉదయం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్రనామావళి, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కార్యక్రమం ఉంటుంది. 19న తెల్లవారుజామున 4.30 గంటలకు కనులపండువగా నిర్వహించే శ్రీఉమామహేశ్వరుల కల్యాణోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీమణి కాటసాని జయమ్మ పాల్గొంటారు. అదేరోజు సాయంత్రం నందికోల ఉత్సవం, రాత్రి రేలారే రేలా, జబర్దస్త్ కార్యక్రమం ఉంటుంది. 20వ తేదీన స్వామివారి రథోత్సవం అంగరంగవైభవంగా సాగనుంది. అదేవిధంగా 21వ తేదీన ఉదయం 9 గంటలకు శివదీక్ష విరమణ, పూర్ణాహుతి, సాయంత్రం నాగవల్లి, వసంతోత్సవం, తెపోత్సవం ధ్వజావరోహణ కార్యక్రమాలు ఉంటాయని ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహేశ్వర స్వామి నిత్యాదాన, ఆర్యవైశ్య నిత్యాన్నదాన, రైతు అన్నదాన సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత అన్నదాన సౌకర్యం కల్పించామన్నారు.

యాగంటికి ప్రత్యేక బస్సులు


శ్రీఉమామహేశ్వరుడిని భక్తులు పెద్దఎత్తున తరలిరానున్న నేపథ్యంలో ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఓ బస్సు ఏర్పాటు చేశామని, భక్తుల రద్దీ మేరకు సర్వీసులు పెంచుతామని ఆర్టీసీ డీఎం రవికిషోర్ తెలిపారు. 17 నుంచి రద్దీ పెరుగుతుందని, భక్తులు ఏ మాత్రం ఇబ్బంది పడకుండా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని డీఎం చెప్పారు.

ప్రారంభమైన వసతుల కల్పన చర్యలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సకల వసతులు కల్పించేందుకు ఆలయ అధికారులు ఇప్పటి నుంచే చర్యలు చేపట్టారు. పెద్ద కొనేరును శుభ్రం చేసే పనులు కార్మికులు చేస్తున్నారు. మహిళా భక్తులు పుణ్యాస్నానాలు ఆచరించేందుకు, దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక వసుతులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎండతీవ్రత నేపథ్యంలో క్యూలైన్ వెంట చలువ పందిర్లు ఏర్పాటు చేయనున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల పార్కింగ్, వ్యాపార దుకాణాల కోసం వేర్వేరుగా స్థలాల కేటాయింపునకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు ఆలయ అధికారులు. అదేవిధంగా 24 గంటలు విద్యుత్ సౌకర్యం, వైద్య శిబిరాలు, మంచినీటి వసతులపై ఆలయ పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఆలయ చరిత్ర

దేశంలో ఎక్కడలేని విధంగా మహేశ్వరస్వాములవారు ఏకశిల విగ్రహ రూపంలో స్వయంభుగా వెలసిన ఏకైక పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి. బనగానపల్లె మండలంలోని వాయువ్య ఎర్రమల పర్వత సానువుల మధ్య మహిమాన్వితమైన యాగంటి క్షేత్రంలో స్వయంభుగా వెలసిన మహేశ్వర స్వామిని అగస్త్యమహర్షి పూజించారని ప్రతీతి. ఈ ఆలయాన్ని విజయనగర సామ్రాజ్య ప్రభువులైన హరిహర బుక్కరాయలు నిర్మాణం చేసినట్లు శాసనాల సమాచారం. విరాట్‌పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారు శివపార్వతులకు సేవలందించి బనగానపల్లెలోని గరిమిరెడ్డి అచ్చమ్మకు జ్ఞాన బోధ చేశారని ఇక్కడ లభించిన చరిత్ర ఆధారాల నుంచి తెలుస్తోంది. ఆలయ ఆవరణలో ప్రకృతి వరప్రసాదాలుగా పెద్ద కొనేరు, చిన్నకొనేరు అలరిస్తాయి. ప్రత్యేకించి రోజురోజుకు పెరుగుతున్న అతిపెద్ద నందీశ్వరుడు ఆకట్టుకుంటాడు. '' నేకంటి–నే కంటి'' అను నానుడి నుంచి యాగంటిగా పిలువబడుతుందని పూర్వికుల మాట. ఇంత మహిమానిత్వం కలిగిన ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటే అన్ని కష్టాలు తొలగుతాయని భక్తుల నమ్మకం



ఆలయంలో పెద్దకొనేరు

క్లుప్తంగా

22వ తేదీలోపు పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న భానుసింగ్

డోన్: ప్రభుత్వ పెన్షనర్లు ఈనెల 22వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ సూచించారు.స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో ఆదివారం జరిగిన ప్రభుత్వ పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షన్ దారులందరికీ ప్రభుత్వం ప్రతినెల 1వ తేదీన పెన్షన్ మొత్తాన్ని బ్యాంకులో జమచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. 11వ పీఆర్సీ, డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం సలహాదారులు మౌళాలి, కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్,సభ్యులు లోక్‌నాథ్‌రెడ్డి, దాసప్ప, రాందాస్‌రెడ్డి, జయరాముడు, శ్యామారావు, రిటైర్డు ఎస్సై మౌళాలి పాల్గొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్ స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

కంటి పరీక్షలు

బేతంచెర్ల: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీయూపీ మెయిన్ స్కూలు ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కంటి వైద్యులు నాగరాజు, శేఖర్ రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 32 మంది కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వలీబాష, రాజు, సభ్యులు మురళీకృష్ణ, విష్ణు, ధను, మోహన్, సుదర్శన్, సాంబ శివారెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం



నగదు అందజేస్తున్న కాచర్ల సత్యనారాయణ కుటుంబ సభ్యులు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధికి ఆదివారం గుంటూరు జిల్లాకు చెందిన కాచర్ల సత్యనారాయణ, జ్యోతిలక్ష్మీ దంపతులు రూ.90వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజ్‌కు దాతలు నగదు అందజేశారు. దాతలను సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు పట్టుబడిన వాహనాల వేలం

అవుకు:మండల కేంద్రం అవుకు పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన 27 మోటార్ సైకిళ్లు, ఒక కారుకు డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. వాహనాలను దక్కించుకున్న వ్యక్తులు వేలంమొత్తంతో పాటు జీఎస్టీని చెల్లించాల్సి ఉంటుదని తెలిపారు.

బలిజ సంఘం అధ్యక్షుడిగా కునుకుంట్ల రమణ



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

అవుకు: అవుకు మండల బలిజ సంఘం అధ్యక్షుడిగా కునుకుంట్ల రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక చెన్నకేశవ ఆలయంలో ఆదివారం బలిజ సంఘం సభ్యులు కునుకుంట్ల రమణతోపాటు ఉపాధ్యక్షునిగా నీరుకట్టు కిట్టును ఎన్నుకున్నారు. అనంతరం వీరిని సభ్యులు పూలమాలతో సత్కరించారు. బలిజల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా కునుకుంట్ల రమణ తెలిపారు.

రణత్ ఎంపికపై హర్షం

డోన్ టౌన్: నంద్యాల జిల్లా ఏఐవైయఫ్ నూతన అధ్యక్షుడిగా డోన్‌కు చెందిన రణత్‌యాదవ్ ఎంపికపై మండల కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆదివారం ఏఐవైయఫ్ మండల సహాయ కార్యదర్శి విజయ్, పట్టణ కన్వీనర్ దివాకర్, నాయకులు విజయ్, చరణ్, అఖిల్, రవీంద్ర తదితరులు రణత్ యాదవ్‌కు అభినందనలు తెలిపారు.

మహానందిలో భక్తుల సందడి

మహానంది: సెలవు రోజు, పెళ్లిళ్లు ఉండటంతో ఆదివారం మహానంది క్షేత్రం భక్తులతో కళకళలాడింది. వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది తరలివచ్చారు. ముందుగా స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. ఉదయం మహామంగళ హారతుల సేవతో ప్రారంభమైన దర్శనం రాత్రి ఏకాంతసేవ వరకు నిర్విరామంగా కొనసాగింది.

17 నుంచి ఓంకారంలో బ్రహ్మోత్సవాలు

బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఈఓ నాగప్రసాద్, విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 17న బండిఆత్మకూరులోని శివాలయం నుంచి ఉత్సవ విగ్రహాలు మంగళ వాయిద్యాల మధ్య క్షేత్రానికి బయలుదేరాతాయని, 18 ఎరకలకాలనీ, శింగవరం, సోమయాజులపల్లె గ్రామాల్లో గ్రామోత్సవాల అనంతరం ఓంకార క్షేత్రం చేరతాయని చెప్పారు. ఆరోజు రాత్రి లింగోద్భవ కాలంలో మూలవరులకు మహాన్యాస రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ఉత్సవ మూర్తులకు కల్యాణం జరిపిస్తామన్నారు. 19న నంది వాహనంపై ఆది దంపతుల ఊరేగింపు, 20 సాయంత్రం రథోత్సవం, 21న వసంతోత్సవం, 22న ఆదిదంపతులు ఓంకారం నుంచి బండిఆత్మకూరు శివాలయానికి చేరుకుంటారని వివరించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

బేతంచెర్ల: ప్రతి ఒక్కరరూ దైవ జ్ఞానం తెలుకోవాలని త్రైత సిద్ధాంతం– ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ధర్మవరం కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు అన్నారు. ఆదివారం మండలంలోని మర్రికుంట గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పరశురాముడు, రంగస్వామి, వెంకటస్వామి, అనిల్ కుమార్, మనోహర్, మద్దమ్మ పాల్గొన్నారు.

ముగిసిన వేంకటరెడ్డి తిరునాల



ప్రజలతో సందడి నెలకొన్న తిరునాల ప్రాంతం

ప్యాపిలి: స్థానిక వెంకటరెడ్డి కాలనీలో వెలసిన అవధూత వేంకటరెడ్డి తిరునాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఉదయం ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తిరునాలకు తరలివచ్చారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలతో ప్రాంగణం కిటకిటలాడింది. దుకాణాలు, జాయింట్ వీల్స్, బ్రేక్‌డాన్స్ వద్ద యువత కోలాహలం కనిపించింది. దుకాణాల వద్ద చిన్నపిల్లలు, మహిళల సందడి నెలకొంది. తిరునాల ఉత్సవాల్లో లాగే తేరు రెండేళ్ల క్రితం విరిగిపోవడంతో దాని స్థానంలో ఎద్దుల బండిపై తేరు నమూనాను ఏర్పాటు చేసి లాగారు. వచ్చే ఏడాది నిర్వహించే వేడుకలకైనా దాతలు ముందుకు వచ్చి కొత్త తేరును ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

తీరని సమస్య!

- డోన్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- ఏడాదిగా పనిచేయని డిస్‌ప్లే బోర్డులు
- పట్టించుకోని రైల్వే అధికారులు



డోన్ రైల్వే స్టేషన్

డోన్ టౌన్: పేరుకేమో జంక్షన్...సౌకర్యాలు మాత్రం నిల్ అన్నట్లుగా ఉంది డోన్ రైల్వే స్టేషన్ దుస్థితి. డోన్ రైల్వే స్టేషన్ మొత్తం ఐదు ప్లాట్ ఫాంలు ఉండగా ముఖ్యంగా మూడు ప్రయాణికుల సౌకర్యం కోసం ఉపయోగిస్తున్నారు. ఇక్కడి నుంచి విశాఖపట్నం, భువనేశ్వర్, వాస్కోడిగామ, మైసూర్, చెన్నై, కలకత్తా, బెంగళూరు, హైదరాబాద్, తిరుపతి, మచిలీపట్నం, రామేశ్వరం, ఓకా, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు రైళ్లు అందుబాటులో ఉన్నాయి. డోన్ మీదుగా నిత్యం 60రైళ్లు వెళ్లేవి. కరోనా లాక్‌డౌన్ కారణంగా రాళ్ల రాకపోకలు బంద్ అయ్యాక పున: ప్రారంభించాక ప్రస్తుతం 46 ఎక్స్ ప్రెస్ రైళ్లతో పాటు రెండు డెమో రైళ్లు డోన్ స్టేషన్ మీదుగా వెళ్తున్నాయి. డోన్ రైల్వే స్టేషన్ నుంచి రోజు కు రెండు వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. డోన్ రైల్వే స్టేషన్‌లో ప్రధాన టిక్కెట్ కౌంటర్‌తో పాటు అదనంగా ప్రైవేట్ వ్యక్తులతో నిర్వహించేవి మరో రెండు కౌంటర్లు ఉన్నాయి. మొత్తం మూడు కౌంటర్లలో కలుపుకొని రోజుకు రూ. 2లక్షల రాబడి రైల్వే శాఖకు చేరుతుంది. అయినప్పటికీ ఈ స్టేషన్‌లో డిస్‌ప్లే పనిచేయని తీరును ప్రయాణికులు తప్పుపడుతున్నారు.

ప్రయాణికుల ఇక్కట్లు :

డోన్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. రిజర్వేషన్ చేసుకున్న ట్రైన్ ఏ ప్లాట్ ఫాంపై ఆగుతుందో... ఏ బోగి ఎక్కడ నిలబడుతోందో తెలియక ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. వృద్ధులు, మహిళలు, పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. డిస్‌ప్లే బోర్డులు పని చేయక పోవడంతో బోగిలు వెతుక్కోవడానికి లగేజీ, చంటి బిడ్డలతో పడరానిపాట్లు పడుతున్నారు.

ఎలా వెళ్లాలో తెలియక తికమక పడ్డాం



మాది ఒంగోలు,పని మీద కర్నూలుకు వచ్చి తిరుగు ప్రయాణంలో డోన్ నుంచి మార్కాపురం వెళ్ళేందుకు డోన్ రైల్వే స్టేషన్‌కు వస్తే ఏ ట్రైన్ ఎక్కడ ఆగుతుందో డిస్ ప్లే కావడం లేదు. విచారణ కౌంటర్‌లో అడిగడానికి అక్కడ ఎవ్వరు లేరు. తోటి ప్రయాణికులను అడిగితే మాకు తెలియదు అంటున్నారు. ట్రైన్ వచ్చే వరకు సరైన అనౌన్స్‌మెంట్ లేదు. ఇలా అయితే మాలాంటివారి పరిసిత్థి ఏంటి. : **అశోక్ కుమార్, రైల్వే ప్రయాణికుడు, ఒంగోలు**

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

డిస్ ప్లే బోర్డులు పని చేయని విషయం వాస్తవం. ఈ సమస్యను ప్రతినెలా జరిగే రివ్యూ మీటింగ్‌లలో ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్తూనే ఉన్నాం. అవుట్ సోర్సింగ్ కంట్రాక్టు కాలపరిమితి అయిపోయింది. కోచ్ పోజిషన్ గురించి మైకు ద్వారా అనౌన్స్‌మెంట్ చేయిస్తున్నాం.

–వెంకటేశ్వర్లు డోన్ రైల్వే స్టేషన్ మేనేజర్

మూడు క్షేత్రాల్లో కరివేన అన్నదాన సత్రాలు

శ్రీశైలం: ప్రముఖ పుణ్యక్షేత్రాలైన హరిద్వార్, అయోధ్య, అన్నవరం క్షేత్రాల్లో అఖిల భారత కరవేన బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు ఎన్ఆర్ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక కరివేన సత్రంలో ఏర్పాటు చేసిన వార్షిక సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో కరివేన నిత్యాన్నదాన సత్రాలు భక్తులకు అందుబాటులో ఉన్నాయన్నారు. శ్రీశైలంలో మరో అదనపు భవనం, అరుణాచలం, భద్రాచలంలలో కొత్త భవనాలను నిర్మించాలని తీర్మానించినట్లు చెప్పారు. ప్రస్తుతం హరిద్వార్, అయోధ్య, అన్నవరంలో అద్దె భవనాల్లో సత్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శేషయ్య

డోన్ టౌన్: సమస్యలు తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలని, ప్రశాంత జీవనం సాగించాలని పట్టణ సీఐ శేషయ్య సూచించారు. స్థానిక వడ్డెరుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేందుకు ఐకమత్యంగా ఒకరికొకరు సహకారం అందించుకోవాలన్నారు. ప్రత్యేకించి సాంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని, ఘర్షణలకు పాల్పడితే జరిగే నష్టాలను గుర్తించుకుని మెలగాలని చెప్పారు. సమస్యలు సర్వసాధారణమని, సామరస్యంగా పరిష్కారం కాకుంటే పోలీసులను ఆశ్రయించాలే తప్పా గొడవలకు వెళ్లకూడదన్నారు. వడ్డెర సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని, వడ్డెరుల విద్యాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు వెంకటేష్, గోపీనాథ్, రామాంజనేయులు, పంపాపతి, నారాయణస్వామి, ఆదినారాయణ, గోవిందు, వెంకటేష్, నాగరాజు, సూరి, చంద్ర, శ్రీను, శేఖర్, నాగాంజనేయులు, హరి, వీరాంజనేయులు, బలరాముడు, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

బతుకు పోరు!



పనిముట్లు తయారు చేస్తున్న మధ్యప్రదేశ్ వాసులు



విక్రయానికి ఉంచిన పనిముట్లు

కొలిమిగుండ్ల: అభాగ్యులకు బతుకు పోరులో కష్టాలు తప్పడం లేదు. జీవనోపాధి కోసం ఏకంగా రాష్ట్రాల సరిహద్దులు దాటేస్తున్నారు కష్టజీవులు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఐదారు కుటుంబాలు రెండు రోజుల క్రితం కొలిమిగుండ్లకు వలస వచ్చారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఎదురుగా రోడ్డు పక్కనే పిల్లలతో కలసి కుటుంబాలు ఎండలోనే కాలం వెల్లదీస్తున్నారు. కొడవలి, సుత్తి, కత్తి తదితర వ్యవసాయ పనిముట్లతో పాటు ఇతర సామగ్రిని రోడ్డు మీదనే తయారు చేస్తున్నారు. రైతులు, ప్రజలకు కావాల్సిన విధంగా పనిముట్లను అక్కడిక్కడే తయారు చేసి విక్రయిస్తున్నారు. రాత్రి చలి, పగలు ఎండ తీవ్రత ఉన్నా జీవనోపాధి దృష్ట్యా ఇబ్బందులు తప్పడం లేదు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్

బేతంచెర్ల: పట్ట భద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎంపీయూపీ మెయిన్ స్కూల్ లోని పోలింగ్ బూత్‌లను ఆదివారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 319 పోలింగ్ బూత్‌లో 768 మంది, 320వ పోలింగ్ బూత్‌లో 1090 ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 171వ పోలింగ్ బూత్‌లో 83 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మౌలిక వసతులు కల్పనపై దృష్టి సారించామని తహసీల్దార్ తెలిపారు.

క్రీడాకారుడికి 'చేయూత'

డోన్ టౌన్: అథ్లెటిక్స్ క్రీడాకారుడు ఆటో నారాయణ స్వామికి చేయూత ట్రస్టు సభ్యులు ఆర్థిక సాయం చేశారు. హర్యాన రాష్ట్రంలోని కురుక్షేత్రంలో ఈ నెల 18 నుంచి జరుగుతున్న 50 ప్లస్ కేటగిరి విభాగలో నేషనల్ అథ్లెటిక్స్‌లో పాల్గొనడానికి వెళ్తున్న ఆయనకి ఖర్చుల నిమిత్తం స్థానిక కార్యాలయంలో ఆదివారం చేయూత కోశాధికారి మీసేవ శ్రీను నగదును అందజేశారు.

ఆలయాభివృద్ధికి విరాళం

మహానంది: గౌడ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణగౌడు రూ.పదివేలు విరాళం అందించినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మహానందిలోని గరుడనంది ఆలయాభివృద్ధికి విరాళం అందించారని చెప్పారు. దాతకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశామన్నారు.

పల్లె ప్రగతి!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ప్రజాసంక్షేమంతోపాటు అభివృద్ధి పరుగులు పెడుతోంది. మండల కేంద్రం సంజామలలో రూ. 2.04 కోట్లతో వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించడంతో పల్లె ప్రగతి వికసిస్తోంది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో రూ. 1.20 కోట్లతో ఎంపీడీఓ కార్యాలయానికి అన్ని హంగులతో నూతన భవనాన్ని నిర్మించారు. రూ. 60 లక్షలతో పశు సంవర్థకశాఖ ప్రాంతీయ పశువైద్యశాల, రూ. 24 లక్షలతో గ్రంథాలయానికి నిర్మించిన కొత్త భవనాలు పూర్తయ్యాయి. సుందరంగా నిర్మించిన కొత్త భవనాలతో పట్టణశోభ సంతరించుకుంది. ఎమ్మెల్యే కాటసాని ఆధ్వర్యంలో నూతన భవనాల ప్రారంభోత్సవం వీలైనంత త్వరలో ఉంటుందని ఎంపీపీ పోచా రమాదేవి వెల్లడించారు.

– కోవెలకుంట్ల



సంజామలలో రూ.1.20 కోట్లతో నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయ భవనం



రూ. 24 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనం



రూ. 60 లక్షలతో ఏర్పాటు చేసిన పశు సంవర్ధకశాఖ ఏడీ కార్యాలయం